సాక్షి అనకాపల్లి

ఆదివారం । 12 । జనవరి । 2025



సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.



ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత

ఎంవీపీకాలనీ: విశాఖ పెద జాలరిపేట తీరంలో ఆలీవ్ రిడ్లే తాబేళ్లు పెద్ద ఎత్తున మృత్యువాత పడ్డాయి.

ఘనంగా కూడారై ఉత్సవం



సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస పూజల్లో భాగంగా శనివారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు

- తిరిగి ఏరియా ఆస్పత్రిలో చేరుతున్న విద్యార్థులు



ఏరియా ఆస్పత్రిలో చేరిన విద్యార్థులను పరామర్శిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

నర్సీపట్నం: కోలుకొని ఇంటికి చేరిన వేములపూడి కస్తూర్బా పాఠశాల విద్యార్థులు అనారోగ్యంతో తిరిగి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేరుతున్నారు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో ముగ్గురు విద్యార్థులు చికిత్స పొందుతుండగా, ఇంటికి వెళ్లిన మరో నలుగురు విద్యార్థులు అనారోగ్యంతో శనివారం ఆస్పత్రిలో చేరారు. మొత్తం ఏడుగురు విద్యార్థులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు అధికారులకు డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కస్తూర్బా జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ జయప్రకాష్, జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పద్మ, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ శాంతికి జిల్లా విద్యాశాఖాధికారి శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంఘటనపై అన్ని కోణాల్లో సమగ్రమైన దర్యాప్తు చేస్తున్నామని డీఈవో తెలిపారు.

కోలుకుంటున్న విద్యార్థులు

నర్సీపట్నం: వేములపూడి కేజీబీవీ విద్యార్థులు కోలుకుంటున్నారు. ఇక్కడ 37 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వీరిలో 31 మంది విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడింది. ఆస్పత్రులు, హాస్టల్‌లోని చికిత్స శిబిరం నుంచి గురు, శుక్ర, శనివారాల్లో వారిని డిశ్చార్జ్ చేశారు. కోలుకున్న విద్యార్థినులంతా సంక్రాంతి సెలవులకు ఇంటి బాటపట్టారు. మిగతావారి ఆరోగ్యం మెరుగుపడుతోంది. ఒకటి, రెండు రోజుల్లో వీరిని కూడా డిశ్చార్జి చేసే అవకాశం ఉంది. ఆంధ్ర మెడికల్ కళాశాల వైద్య బృందం వసతి గృహం వంట సిబ్బంది మల నమూనాలను కూడా సేకరించారు. వారి నుంచి రోగ లక్షణాలు వ్యాప్తి చెందాయా అన్న కోణంలో కూడా పరిశోధిస్తున్నారు. ఈ నమూనాలను వైరాలజీ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపనున్నట్లు తెలిసింది. పరీక్షల్లో మంచినీరు బాగానే ఉన్నట్లు తేలింది. దీంతో మిగతా కారణాలపై అధికారులు దృష్టి పెట్టారు. ఆహార పదార్థాలు ఆరోగ్యకరంగా ఉన్నాయా లేవా అని పరిశీలిస్తున్నారు.

రేపు సింహగిరిపై సంక్రాంతి సంబరాలు

సింహాచలం: సింహగిరిపై సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆరోజు ఉదయం రాజగోపురం ఎదురుగా పెద్ద ఎత్తున భోగి మంటను వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జగం దేవర, కొమ్మదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, కపిలగిత్త, ఎడ్లబండి, పూరిళ్లు, కుండల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటలకు చిన్న పిల్లలకు భోగిపళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల తల్లిదండ్రులు తమపిల్లలను సింహగిరిపై ఉన్న నృసింహమండపంలోకి తీసుకురావాలన్నారు. అలాగే మహిళలకు ఆదివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ముగ్గులు వేయాల్సి ఉంటుందన్నారు. విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈనెల 15వ తేదీన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉదయం 9 గంటలకు గోపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో తెలిపారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా సింహాచలం

మహారాణిపేట: పలువురు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లిస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ ఎ.సింహాచలం ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. విశాఖ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్న జి.జయదేవిని వంశధార ప్రాజెక్టు భూసేకరణ అధికారిగా నియమించారు. అనకాపల్లి జిల్లా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్‌గా ఎస్.నరసింహమూర్తి. అనకాపల్లి జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బి.ఆశయ్య నియమితులయ్యారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం

మహారాణిపేట : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శనివారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ఆయనకు విశాఖ విమానాశ్రయంలో కలెక్టర్ హరేంద్ర ప్రసాద్. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి నేరుగా గ్రాండ్ బే హోటల్‌కి వెళ్లారు.

వ్యాపారాలు తగ్గుముఖం

- పేద, మధ్యతరగతి ప్రజల దగ్గర డబ్బులేని పరిస్థితి
- ఖరీఫ్ సీజన్‌లో అప్పుల ఊబిలో అన్నదాత
- నిత్యావసర ధరల పెంపు.. ఆదుకోని ప్రభుత్వం

సంక్రాంతి సీజన్‌లో వ్యాపారం సుమారుగా..
గత ఏడాది రూ.300 కోట్లు
ఈ సంవత్సరం రూ.200
తగ్గుదల సుమారు 30 శాతం



సంక్రాంతి.. రైతుల ఆనందం ప్రతిఫలించే వేడుక. పౌష్య లక్ష్మి కళకళలాడగ గ్రామాల్లో ఉత్సాహం ఉరకలేసే పండగ. పిల్లల నుంచి పెద్దల వరకు.. ఉన్నవారి నుంచి లేనివారి వరకు జరుపుకునే పర్వదినం. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పాలకుల ఆసరా తోడైనప్పుడు ఇలాంటి సందర్భాల్లో సంతోషం తాండవమాడుతుంది. నాయకులు తోడేళ్లయితే ఆశలు కాస్తా ఆవిరై వేదన మిగులుతుంది. ఈ ఏడాది సంక్రాంతి వేళ సరిగ్గా అలాంటి అవాంఛనీయ ధోరణి కనిపిస్తోంది. కొనుగోళ్లు తగ్గిపోయాయి. వ్యాపారాలు డీలా పడ్డాయి. ఊరు ఉసూరుమంటుంటే సంక్రాంతి శోభ ఎలా కానవస్తుంది?

వ్యాపారాలు వెలవెలబోయాయిలా..

- జిల్లాలో ప్రధానంగా బంగారు, వస్త్ర దుకాణాలు, కిరాణా, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ షాపు, బైక్ షోరూంల వ్యాపారాలు సగానికి సగం తగ్గిపోయాయి. ఎన్నికల తర్వాత లావాదేవీలు క్రమంగా తగ్గిపోయాయి. సంక్రాంతి సీజన్‌లో పుంజుకుంటాయని భావించినా ఆశించిన ఫలితం కనిపించలేదు
- కిరాణా సరకుల అమ్మకాలు 10 శాతం తగ్గిపోయాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతోపాటు సామాన్య ప్రజల దగ్గర డబ్బులు లేకపోవడమే ఇందుకు కారణమని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా వంట నూనెల ధరలు భారీగా పెరిగిపోవడంతో.. ఆ వ్యాపారంలో 50 శాతం వరకూ లావాదేవీలు తగ్గాయని చెబుతున్నారు.
- బంగారం వ్యాపారస్తులు పూర్తిగా నిరాశగాలో ఉన్నారు. 60 శాతం వ్యాపారం తగ్గిందని చెబుతున్నారు.
- వస్త్ర దుకాణాల్లో 20 శాతం వ్యాపారం తగ్గింది.
- బైక్స్ షోరూముల్లో కూడా విక్రయాలు తగ్గాయి. ఈ ఏడాది 60 శాతం తగ్గాయని సమాచారం.

- గత ఆరు నెలలుగా వ్యాపారం బాగా తగ్గిం**దని వ్యాపారులు** చెబుతున్నారు. అనకాపల్లి **బెల్లం మార్కెట్**లో ప్రతి నెలా సగటున 7 వేల **బెల్లం దిమ్మల** అమ్మకాలు జరుగుతాయి. సం**క్రాంతి సమయం**లో 9 వేల నుంచి 10 వేల **బెల్లం దిమ్మల** వ్యాపారం జరుగుతుంది. కానీ **ఈ ఏడాది 7 వే**ల దిమ్మలు కూడా అమ్ముడు **పోలేదు.**

- ఊరు ఉసూరు.. ఏదీ సంక్రాంతి హుషారు!

మార్కెట్ వెలవెల



సంక్రాంతి రోజుల్లోనూ అనకాపల్లిలో తక్కువ మంది వినియోగదారులతో కనిపిస్తున్న ఓ వస్త్ర దుకాణం

సాక్షి, అనకాపల్లి: ఏడాదంతా జరిగే వ్యాపారం ఒక ఎత్తు.. సంక్రాంతి సీజన్‌లో జరిగే లావాదేవీలు ఒక ఎత్తు. పంట చేతికొచ్చి డబ్బులు ఆడడంతో రైతన్న మోములో ఆనందం తాండవించేది. ఆ సంతోషం ఊరంతా ప్రతిఫలించేది. అన్ని వర్గాల **వారూ ఉత్సా**హంగా పెద్ద పండగ జరుపుకునేవారు. **వ్యాపార కేం**ద్రాలు కళకళలాడేవి. అందరూ కొత్త **దుస్తులు ధరిం**చడంతో ముఖ్యంగా వస్త్ర వ్యాపారం **ఎక్కువగా జరిగే**ది. బంగారు దుకాణాలు కిటకిటలాడే**వి. పిండి వం**టల కోసం కిరాణా దుకాణాలు కిక్కిరిసి**పోయేవి. కానీ** ఈసారి వ్యాపారాలు వెలవెలబోతున్నా**యి. సుమారు** 30 శాతం కొనుగోళ్లు తగ్గడంతో వ్యాపా**రుల ముఖాల్లో** కళ కనిపించడం లేదు. వ్యాపారం **భారీగా పతనమైం**ది. ఏటా సంక్రాంతి సందర్భంగా **జిల్లాలో రూ.300** కోట్ల వరకు వ్యాపారం జరిగేది. **కానీ జిల్లాలో** ప్రస్తుతం రూ.200 కోట్ల వ్యాపారం కూ**డా జరగలేదని** విక్రేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజల్లో డబ్బులు లేని పరిస్థితి నెలకొంది. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించకపోవడం కూడా కారణంగానే భావించవచ్చునని వ్యాపారస్తులు చెబుతున్నారు.

అప్పుల ఊబిలో అన్నదాత...

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఈ ఏడాది ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించలేదు. ఎరువులు, విత్తనాల సబ్సిడీ, నాణ్యత లేకపోవడంతో రైతు స్వయంగా డబ్బులు వెచ్చించి ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేయడం జరిగింది. రైతుకు దిగుబడి తగ్గింది.. అప్పులు పెరిగాయి. ధాన్యం కొనుగోలు చేసి వచ్చిన ఆదాయంతో ఇంటిల్లిపాదికి కొత్త బట్టలు, బంగారం కొనేవారు. నిత్యావసర వస్తువులు ప్రక్రియ ప్రైవేట్ చేతుల్లో పెట్టడంతో సకాలంలో ధాన్యం కొనుగోలు డబ్బులు అందలేదు. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు అడుగడుగునా సమస్యలు కుప్పలు తెప్పలుగా ఎదురయ్యాయి. గతేడాది ఇదే సమయానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు, రైతు పంట దిగుబడి ఆదాయం చేతికొచ్చింది. గ్రామాలకు ప్రతీకైన రైతు బావుంటేనే గ్రామాలు బావుంటాయి. అలాంటి రైతుకు ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుకు ప్రభుత్వ ప్రోత్సాహం లేదనే చెప్పుకోవచ్చు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు లేకపోవడం, పెట్టుబడి సాయం అందించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఏటా ఈ సమయానికి వ్యాపారస్తులంతా 90 శాతం వ్యాపారం జరిగి రెట్టించిన ఉత్సాహంతో ఉండేవారని అనకాపల్లిలోని కిరాణ హోల్‌సేల్ వ్యాపారి పెతకంశెట్టి శివ సత్యనారాయణ చెప్పారు. పండగకు ఇంకా ఒక్క రోజే మిగిలి ఉండని, గతంలో జరిగిన వ్యాపారంలో సగం కూడా అవ్వలేదని ఆయన చెప్పారు. దీనికి పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడడమే కారణమన్నారు. నిత్యావసరాలతో పాటు అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాల సొమ్ము అందకపోవడం కూడా ప్రధాన కారణమని ఆయన చెప్పారు.

అప్పు ఎక్కువ.. ఆదాయం తక్కువ



ఖరీఫ్ సీజన్‌లో రైతులు పెట్టుబడి నుంచి పంట చేతికొచ్చే దినం దినం భయంగా గడిపారు. విపత్తులు వస్తే ఆదుకోవడానికి పంట ఉచిత భీమా సౌకర్యం లేదు. పంట ప్రారంభంలో పెట్టుబడి సాయంకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు సార్లు భారీ వర్షాలతో పంట మునిగిపోయి దిగుబడి తగ్గింది. అప్పులు పెరిగాయి..ఆదాయం తగ్గింది. ప్రభుత్వం రైతును పూర్తిగా మరిచిపోయింది. ఈ ఏడాది సంక్రాంతి పండుగను ఆనందంగా చేసుకునే పరిస్థితి ఏ రైతుకు లేదు. గతేడాది ఈ పాటికే రెండు మూడు ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు బ్యాంక్‌లో పడ్డాయి. రైతుకు అప్పులేకుండా పంట పండించుకున్నాడు.

–వాసుపల్లి తాతయ్యలు,
గవరపాలెం

పైసలు లేక పండగ లేదు...



కూటమి ప్రభుత్వం ఆరు నెలలు కావస్తున్నా పైసా ఆదాయం కూడా లేకుండా పోయింది. పెరిగిన నిత్యావసరాల ధరలతో కూలిడబ్బులు రోజువారి జీవనానికే సరిపోతున్నాయి. సూపర్ సిక్స్ అంటూ కూటమి నాయకులు చెప్పిన ఒక్క పథకాన్ని కూడా అమలు చేయకుండా ప్రజలను తీవ్రంగా మోసం చేశారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా పండుగ పూట పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో రైతు భరోసా, అమ్మ ఒడి, వాహనమిత్ర, చేయూత, వంటి పథకాలతో కుటుంబంలో ప్రతి ఒక్కరికి అందిన లబ్ధి నేడు లేదు. కూటమి ప్రభుత్వం ప్రజలను పూర్తిగా మోసం చేసింది.

–గోటాల నవీన్,
రేబాక గ్రామం

‘ఉరకలు’ వేసే ఉత్సాహం



సంక్రాంతి సందర్భంగా ఎడ్ల బళ్ల పోటీలకు పల్లెలు సిద్ధమవుతున్నాయి. జిల్లాలో పలుచోట్ల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో

- కొనసాగుతున్న గోవాడ సుగర్స్ కార్మికుల ధర్నా

ఆకలేసి కేకలేశారు..



ఆందోళన చేస్తున్న ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం నాయకులు, కార్మికులు

చోడవరం: జీతభత్యాలు పాతబకాయిలు చెల్లించాలని కోరుతూ కార్మికులు రెండో రోజు కూడా నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి యాజమాన్యం మాట తప్పిందంటూ శుక్రవారం విధి నిర్వహణలో ఉన్న కార్మికులంతా విధులను నిలిపివేసి గేటు బయటకు వచ్చి ఎండీ చాంబర్‌లో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. శనివారం కూడా వీరి సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండో రోజూ కూడా విధులను బహిష్కరించి ఆందోళన చేశారు. సంక్రాంతి లోగా కార్మికులకు రావలసిన పాత బకాయిలు చెల్లిస్తామని చెప్పి ఇప్పటి వరకూ చెల్లించలేదని గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేవీవీ భాస్కరరావు ప్రశ్నించారు. కార్మికులకు ఓటీల డబ్బులు ఇవ్వలేదని, గతేడాది నుంచి డీఏలు ఇవ్వలేదని, ఇవన్నీ వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.

సిటు ఆందోళన

కార్మికులకు మద్దతుగా సీఐటీయూ నిలిచింది. ఫ్యాక్టరీ గేటు బయట ఏపీ చెరకు రైతు సంఘం, సిటు ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. కార్మికులకు రావలసిన జీతభత్యాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. పండగ పూట కూడా వారిని పస్తులు ఉంచడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో సిటు నాయకులు వి.వి.శ్రీనివాసరావు, ఎస్‌వి నాయుడు, నాయినబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవాలి

దేవరాపల్లి: జిల్లాలోని సుగర్ ఫ్యాక్టరీలను ఆదుకోవడంతో పాటు మూతపడిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అనకాపల్లి ఎంపీ రమేష్ నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళనకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు స్పష్టం చేశారు. గత ఏడాది రైతులు సరఫరా చేసిన చెరుకుకు నేటి వరకు బకాయిలు చెల్లించకపోవడం అత్యంత దారుణమన్నారు.

- 16 ఏళ్లుగా రామకృష్ణ సేవాసమితి కార్యకలాపాలు
- వివేకా బాలవికాస్ సంస్థ ద్వారా ఆధ్యాత్మిక వికాసం
- చిన్నారులు, యువతను సన్మార్గంలో నడిపించే యత్నం
- ప్రతి ఏటా వారం రోజులపాటు జయంత్యుత్సవాలు
- నక్కపల్లి మండలం డొంకాడ గ్రామస్తుల ఆదర్శం

వివేకానందుడు స్ఫూర్తిగా..



అమెరికాలో ఆధ్యాత్మిక వాణి వినిపించిన వివేకానందుడి స్ఫూర్తి ఈనాటికీ వారిని ముందుకు నడిపిస్తోంది. ఊరంతా ఒక్కటై కొత్త తరంలో కూడా నైతిక విలువలు పెంపొందేలా రామకృష్ణ సేవాసమితి, వివేకా బాలవికాస్ సంస్థలను స్థాపించారు. చిన్నారులను సన్మార్గంలో నడిపిస్తున్నారు.



స్వామి వివేకానంద బాలవికాస్ మందిరంలో చిన్నారుల యోగాభ్యాసం

నక్కపల్లి: వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని నక్కపల్లి మండలం డొంకాడలో గ్రామస్తులు 16 ఏళ్ల క్రితం రామకృష్ణ సేవాసమితిని స్థాపించారు. అనేక ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివేకానందుడి బోధనలను గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నేటి యువతలో స్ఫూర్తిని నింపుతున్నారు. రామకృష్ణ సేవాసమితి పేరుతో 2008లో సంస్థను ఏర్పాటు చేశారు. 2020లో వివేకా బాలవికాస్ సంస్థను నెలకొల్పారు. వివేకానందుడి జయంతి సందర్భంగా వారం రోజులపాటు యువజనోత్సవాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అంతే కాకుండా ప్రతి రోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బాలలపై ప్రత్యేక దృష్టి

రామకృష్ణ సేవాసమితి, వివేకా బాలవికాస్ సంస్థల ద్వారా బాల బాలికలను తీర్చిదిద్దడంపై ఈ గ్రామస్తులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రతి రోజు సాయంత్రం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు వేర్వేరుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 1 నుంచి 5 తరగతుల వారికి మూడు రోజులు, ఐదు నుంచి 10 తరగతుల వారికి మూడు రోజులు ఇలా వారం రోజులపాటు సుమారు 80 మంది విద్యార్థులకు రామాయణం, మహాభారతం, వేమన పద్యాలు, సుమతీ శతకాలు, భాగవతం, నీతి వాక్యాలు, నీతి సూత్రాలు, నీతి కథలు, ఆధ్యాత్మిక విషయాలు బోధిస్తున్నారు. అంతేకాకుండా గ్రామస్తుల సహకారంతో ఈ బాలవికాస్ కేంద్రాలకు వచ్చే విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి రోజు జీరా రైస్, పులిహోర, బిరియాని, పాయసం వంటి పౌష్టికాహారం, చిక్కీలు, వేరుశనగ ఉండలు, చాక్లెట్లు, జంతికలు వంటి స్నాక్స్ సమకూరుస్తున్నారు.

వివేకానందుడి జయంతిని వారం రోజుల పాటు నిర్వహించి చివరి రోజున గ్రామస్తులంతా ఉదయాన్నే శుచిగా స్నానాలు ఆచరించి నగర సంకీర్తన ఆలపిస్తూ వివేకానందుడి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగిస్తారు. వివేకానందుడి బోధనలపై ఎక్కువ అవగాహన ఉన్న వ్యక్తులు, ప్రముఖులను అతిథులుగా ఆహ్వానించి వారి ద్వారా వివేకానందుడి బోధనలను గ్రామస్తులకు తెలియజేస్తారు. సుమారు 16 సంవత్సరాల నుంచి నిరంతరాయంగా ప్రతి ఏటా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



వివేకానందుడి జయంతి సందర్భంగా చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం (ఫైల్)

పోలీస్ పరీక్షలకు నాలుగు రోజులు బ్రేక్

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్ల నియామక పరీక్షలకు నాలుగు రోజులు విరామం ప్రకటించారు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం నుంచి 15వ తేదీ వరకు సెలవు ప్రకటించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తిరిగి ఈనెల 16న యథావిధిగా శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శనివారం జరిగిన పరీక్షలకు 600 మందికి 319 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. వారిలో 235 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు అర్హత సాధించారన్నారు.

నేడు సికింద్రాబాద్‌కు స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆదివారం సికింద్రాబాద్(చర్లపల్లి స్టేషన్)కు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–చర్లపల్లి (07246) స్పెషల్ రైలు 12వ తేదీన ఉదయం 8 గంటలకు విశాఖలో బయల్దేరి రాత్రి 9.20 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు జంక్షన్, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, మధిర, ఖమ్మం, డోర్నకల్ జంక్షన్, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట, జనగాం స్టేషన్లలో ఆగుతుంది.

క్లుప్తంగా

రంగురాళ్ల క్వారీల్లోకి చొరబడితే తాట తీస్తాం..



మాట్లాడుతున్న రేంజర్ లక్ష్మీనర్సు

నర్సీపట్నం : రంగురాళ్ల క్వారీల్లోకి చొరబడితే తాట తీస్తామని నర్సీపట్నం రేంజర్ లక్ష్మీనర్సు హెచ్చరించారు. రేంజ్ పరిధి రంగురాళ్ల క్వారీలు ఉన్న కరక, యల్లవరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి, గ్రామస్తులతో సమావేశమయ్యారు. రేంజర్ మాట్లాడుతూ డీఎఫ్‌వో ఎం.శామ్యూల్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. క్వారీల్లోకి ఎవరు చొరబడినా సమీపంలో ఉన్న గ్రామస్తులు బాధ్యులు అవుతారన్నారు. సంక్రాంతి పండగ సమయంలో అధికారులు ఎవరూ ఉండరులే అని తవ్వకాలకు ప్రయత్నిస్తే తీసుకునే చర్యలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. తవ్వకాలకు యత్నించినా, ప్రోత్సహించిన వ్యాపారులను సైతం వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. పండగ సమయంలో క్వారీల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశామన్నారు. ఆయా గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు ఎవరు వచ్చిన వెంటనే అటవీ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలన్నారు.

1300 లీటర్ల సారా పులుపు ధ్వంసం



సారా పులుపును స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

నర్సీపట్నం /మాకవరపాలెం : సారా తయారీకి నిల్వచేసిన 1300 లీటర్ల బెల్లం పులుపును ఎక్సైజ్ పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. సీఐ కె.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ కిరణ్ కుమార్, సిబ్బంది మాకవరపాలెంలో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి డ్రమ్స్‌లో నిల్వ చేసిన పులుపును ధ్వంసం చేశారు. వంట సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. సారా బట్టీలు నిర్వహించే వారి వివరాలను సేకరించే పనిలో ఉన్నామని, వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ సునీల్ కుమార్ హెచ్చరించారు.

పోలీస్ పరీక్షలకు నాలుగు రోజులు బ్రేక్

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్ల నియామక పరీక్షలకు నాలుగు రోజులు విరామం ప్రకటించారు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం నుంచి 15వ తేదీ వరకు సెలవు ప్రకటించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తిరిగి ఈనెల 16న యథావిధిగా శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శనివారం జరిగిన పరీక్షలకు 600 మందికి 319 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. వారిలో 235 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు అర్హత సాధించారన్నారు.

ఉరకలేస్తున్న ఒంగోలు ఎద్దులు



ఎడ్ల బళ్ల పోటీలకు సిద్ధమవుతున్న పల్లెలు
సంక్రాంతి సందర్భంగా సందడే సందడి

బరిలో ఉరకలు వేసే ఉత్సాహం



పరుగు తీస్తున్న ఎడ్లు

చోడవరం: ధాన్య, ధన రాశులతో తులతూగుతూ రైతులు ఆనందంగా ఉన్న రోజుల్లో వచ్చే సంక్రాంతి పండగ ఎన్నో సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలకు నెలవుగా ఉంటుంది. ఎన్నో పల్లె సంప్రదాయాలు కనుమరుగవుతున్నప్పటికీ ఇప్పటికీ పల్లె క్రీడలు కొన్ని జనాన్ని అలరిస్తూనే ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఎడ్లబళ్ల పోటీఉ, కోడిపందాలు, గుర్రాల పరుగు పోటీలు పల్లెల్లో సంక్రాంతి శోభను ఇనుమడింపజేస్తాయి. కోడి పందాలపై నిషేధం విధించడంతో సంక్రాంతి పండగంతా ఎడ్ల బళ్ల పరుగు పోటీల వైపే ఆసక్తిగా చూస్తుంది. కనుమ పండగ నుంచి ప్రారంభమయ్యే ఈ ఎడ్ల బళ్ల పోటీలు తీర్థాలు, గ్రామదేవల పండగల సందర్భంగా కూడా నిర్వహిస్తారు. పెద్దపండగ వచ్చిందంటే ఎడ్లబళ్ల పోటీల కోసం జనం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో ఎడ్లబళ్ల పోటీలు ప్రధానంగా చోడవరం, మాడుగుల పరిసర మండలాలైన దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, వూడుగుల, సబ్బవరం, చోడవరం, బుచ్చెయ్యపేట, రోలుగుంట, రావికమతం మండలాల్లో జరిగేవి. క్రమేణా రాంబిల్లి, అచ్యుతాపురం, యలమంచిలి, నక్కపల్లి, కశింకోట, అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, కోటవురట్ల తదితర మండలాలకు విస్తరించాయి. కొందరైతే ప్రత్యేకంగా ఈ సంక్రాంతిలో ఎడ్ల బళ్ల పోటీల కోసమే ఒంగోలు, మైసూర్‌తో పలు మేలుజాతి ఎడ్లను లక్షలాది రూపాయలు ఖర్చుచేసి మరీ కొనుగోలు చేసి వాటికి శిక్షణ ఇస్తారు. హింస, జూదానికి తావు లేకుండా కేవలం ఆటవిడుపుగా ఉల్లాసంగా ప్రతి ఒక్కరిలోనూ ఆనందాన్ని నింపే విధంగా గెలుపే లక్ష్యంగా పోటీ ప్రతిష్టతో నిర్వహించే ఈ ఎడ్ల బళ్ల పరుగుల పోటీలు క్రీడాస్ఫూర్తితో జరుగుతాయి. అందుకే ఈ పోటీలకు ప్రజల నుంచి విశేష స్పందన ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి కూడా ఈ పోటీల సమయానికి సందర్శకులు చేరుకుని ఉత్సాహంగా పోటీలను తిలకిస్తారు.

పోటీలు ఇలా...

పందెంలో పాల్గొనే ఎడ్ల (జత)ను ఎంట్రీల ప్రకారం వరుస నంబర్లు వేసి తేలికపాటి ఎడ్లబళ్లకు ఎద్దులను బూసి పరుగెత్తిస్తారు. ఒక్కో బండి నిర్వహణకు ఇద్దరు వునుషులు ఉంటారు. ఏ ఎడ్ల బండి తక్కువ సమయంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకొని తిరిగి వస్తుందో ఆ ఎద్దులు విజయం సాధించినట్టుగా పరిగణిస్తారు. కొన్ని ప్రదేశాల్లో నాలుగైదు ఎడ్లబళ్లను ఒకేసారి మైదానంలో ఉంచి పరుగుల పోటీ నిర్వహిస్తారు. ఈ తరహా పోటీలు తక్కువగా ఉండగా ఒక్కో బండి పరుగుతీసే పోటీలే ఎక్కువగా జరుగుతుంటాయి. పోటీలో గెలుపొందిన ఎద్దులకు ముందుగా నిర్దేశించిన పారితోషకాన్ని బహుమతిగా ఇస్తారు.



పోటీలు ఉత్సాహంతో తిలకిస్తున్న ప్రజలు

పోటీలో పాల్గొనే ఎడ్లబళ్లు :

వుంచి వయస్సులో మేలుజాతి హుషారైన ఎద్దులను ఈ పోటీలకు దించుతారు. పందెం సమయంలో బండి బోల్తా పడినా ఎద్దులకు గానీ ఎవరికీ పెద్దగా ప్రమాదం కలగజేయకుండా ఉండే తేలికపాటి బళ్లను ఉపాయోగిస్తారు. ఈ పోటీల కోసం తేలికగా ఉండి ప్రత్యేకంగా బేరింగ్లు వేసిన చక్రాలను ఈ బళ్లకు ఏర్పాటు చేస్తారు. ఒక వేళ పోటీల్లో బండి బోల్తా పడినా వెంటనే నిర్వాహకుడు బండి తిరిగి లేపి పరుగు తీసే విధంగా అత్యంత తేలిగ్గా బండి తయారు చేస్తారు.

పోటీలకు ఆటస్థలం :

రైతుతో ముడిపడి నిత్యం రైతుతోనే కలిసి ఉండే ఎడ్లబండితోఎద్దులు పరుగెత్తే ఈ పోటీలో పాఠశాలల్లోను, ఆట స్థలాల్లోను నిర్వహించరు. ఎద్దులు, రైతులు నిత్యం కలియతిరిగే పంట పొలాల్లోనే ఈ పోటీలు నిర్వహిస్తారు. జనవరి నెల ప్రారంభానికి ఖరీఫ్ వరిపంట కోతలు పూర్తవ్వడంతో చాలా పొలాల్లో సంక్రాంతి పండగ జరిగే వరకు ఏ పంట వేయరు.

దీంతో కోతలు జరిగిపోయి ఖాళీగా ఉన్న పొలాలను నిర్దేశించిన లక్ష్యం మేర పొలాల మడుల మధ్య ఉన్న గట్లను తొలగించి ఎడ్లపందాలు నిర్వహిస్తారు. కొన్ని గ్రామాల్లో సమీపంలో నీరులేని సాగునీటి చెరువుల్లో కూడా నిర్వహిస్తారు. రైతులంతా పిల్లా పాపలతో ఉరకలెత్తుతున్న ఎడ్లను తిలకించి వాటికి మరింత ప్రోత్సాహం ఇస్తూ చప్పట్లు కొడుతూ ప్రదర్శనను ఆస్వాదిస్తారు. పోటీలు నిర్వహించేటప్పుడు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుగా అన్ని ఏర్పాట్లు నిర్వాహకులు చేస్తారు.

ఎన్నో బహుమతులు గెలుచుకున్నా...



నేను పొలం పనులతో పాటు ఎడ్ల బళ్ల పోటీలపై ప్రధానంగా దృష్టి పెట్టి మేలు జాతి ఎద్దులను పెంచుతున్నాను. నా దగ్గర రెండు జతల మేలు జాతి ఎద్దులు ఉన్నాయి. వీటి పెంపకానికి రోజూ భారీగానే ఖర్చవుతుంది. ఏటా జరిగే పందాల్లో 80 నుంచి 110 వరకు పోటీల్లో నా ఎద్దులు ఎక్కువ సార్లు మొదటి బహుమతులు తెచ్చాయి. జిల్లా, ఉత్తరాంధ్ర, ఉభయగోదావరితోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం నా ఎద్దులు బహుమతులు గెలుచుకున్నాయి. గతేడాది తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో వరుసగా మొదటి, రెండో బహుమతులు గెలుచుకున్నాయి. –లెక్కల సత్తిబాబు, లెక్కలవానిపాలెం, చోడవరం

పెంపకంలో జాగ్రత్తలు



వ్యవసాయంలో నాతో కలిసి జీవించే ఎద్దులు పోటీల్లో పరుగులు తీస్తుంటే ఆ ఆనందం చెప్పలేను. రూ.లక్షా 60వేలుపెట్టి ఎద్దులు కొన్నాను. వీటి పెంపకంలో చాలా జాగ్రత్తలు తీసుకొంటాను. మంచి పోషకాహారంతోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా చాలా అవసరం. ఇప్పటి వరకు అనేక పందాల్లో బహుమతులు సాధించాను. ఈ ఏడాది మరిన్ని పోటీలు గెలవాలని ఉత్సాహంగా ఉన్నాను. –ముమ్మిన రామకృష్ణ, ఎడ్లపెంపకందారుడు, నర్సయ్యపేట

విశాఖ ఉక్కుపై కూటమి కుట్ర

- స్టీల్ ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ లకే రాజారావు



సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నాయకులు

సీతంపేట: 'విశాఖ ఉక్కును నిర్వీర్యం చేయాలనే కుట్ర కేంద్రానికి ఉన్నట్టుంది..అందుకే విశాఖ వచ్చిన ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ కోసం ఒక్కమాట మాట్లాడలేదు' అని విశాఖ స్టీల్ ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ లకే రాజారావు ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా స్టీల్‌ప్లాంట్ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లకపోవడం ఉత్తరాంధ్ర ప్రజలను విస్మయానికి గురి చేసిందన్నారు. నక్కపల్లిలో పెట్టబోతున్న ప్రైవేట్ రంగంలోని స్టీల్ ప్లాంట్‌కు హైటెక్ పద్ధతుల్లో ఇనుప ఖనిజాన్ని సరఫరా చేస్తామని సభలో ప్రకటించిన చంద్రబాబు.. విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడకపోవడం కేంద్రం కుట్రలో భాగమేనన్నారు. అమరావతి రైతులకిచ్చిన ప్రాధాన్యత విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇవ్వక పోవడం దేనికి నిదర్శనమో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శివప్రసాద్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు పూర్తి వ్యతిరేకమని ప్రగల్భాలు పలికిన పవన్ కల్యాణ్ ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. జేఏసీ బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, రచయిత తెన్నేటి జయరాజ్, ఆదివాసి వికాస్ పరిషత్ ప్రతినిధి రామారావు దొర, మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు బాగం గోపాలరావు, కనికెళ్ల వరలక్ష్మి, ఎం.అన్వేష్ తదితరులు సంఘీభావం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

యలమంచిలి రూరల్ : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్న ప్రమాదంలో మున్సిపాలిటీ పరిధి పెదపల్లికి చెందిన బొద్దపు త్రినాథ్ (52) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎర్రవరం సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారి పక్కనున్న నేచురల్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెట్ జ్యూస్ పరిశ్రమలో రోజువారీ కూలీగా పనిచేస్తున్న త్రినాథ్(52) పరిశ్రమకు సంబంధించిన పనిపై తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎర్రవరం సమీపంలో పెట్రోల్ బంక్ నుంచి బయటకు వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో త్రినాథ్ తలకు బలమైన గాయం కావడంతో ప్రమాదస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మరో ద్విచక్ర వాహనం నడుపుతున్న పెదపల్లి గ్రామానికి చెందిన కడిమిశెట్టి బాపన్న శెట్టి కూడా తీవ్రంగా గాయపడడంతో అతడిని విశాఖపట్నంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతునికి ఇద్దరు ఆడ, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

నష్ట పరిహారం కోసం డిమాండ్

త్రినాథ్ మృతితో పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని, నష్టపరిహారం ఇవ్వాలని పెదపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి కుమార్, సీఐటీయూ నేత చింతకాయల శివాజీ శనివారం రాత్రి డిమాండ్ చేశారు. మృతుడు పనిచేస్తున్న పరిశ్రమ యాజమాన్యం కేవలం రూ.50 వేలు పంపించిందని, నష్టపరిహారం ఇవ్వకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

యువతి ప్రాణాలను కాపాడిన ఆర్పీఎఫ్ సిబ్బంది

గోపాలపట్నం: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించిన యువతిని రైల్వే పోలీసులు కాపాడారు. మర్రిపాలెం ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలు..శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మర్రిపాలెం–గోపాలపట్నం రైల్వే ట్రాక్‌పై యువతి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఈ విషయం గమనించిన స్థానికులు వెంటనే ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించడంతో విధి నిర్వహణలో ఉన్న ఎస్ఐ ఎం.నాయక్, కానిస్టేబుల్ మూర్తితో కలిసి ట్రాక్‌పై వెళ్తున్న ఆమెను రక్షించారు. ఆరా తీయగా.. కొబ్బరితోటకు చెందిన యువతి అని స్నేహితుడితో వచ్చిన సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకుందని తెలిపారు. యువతికి కౌన్సెలింగ్ ఆమె ఇచ్చి బంధువులకు అప్పగించారు.

'ఆయుష్'కు ఊపిరి

- త్వరలో అందుబాటులోకి కళాశాల, టెస్టింగ్ ల్యాబ్
- విమ్స్‌లోకి మధురవాడ ఆర్‌డీడీ కార్యాలయం
- డిస్పెన్సరీల్లో ఆరోగ్యకరమైన వాతావరణం
- కొత్తగా 39 మంది ఆయుర్వేద వైద్యులు
- ఆరు జిల్లాల్లో 22 డిస్పెన్సరీలు ఏఏఎంలుగా మార్పు
- 'సాక్షి'తో ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్‌డీడీ ఝాన్సీ లక్ష్మి



మాట్లాడుతున్న ఆర్‌డీడీ ఝాన్సీ లక్ష్మి

మధురవాడ: ఆయుష్ వైద్యానికి మంచి రోజులు రాబోతున్నాయా అంటే నిజమనే చెప్పాలి. దీని పరిధిలోని ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియో, తదితర కేంద్రాల అభివృద్ధి కోసం అనేక ఏళ్లుగా ప్రతిపాదనల దశలోనే ఉండిపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యంగా నేచురోపతి అభివృద్ధికి కీలక అడుగులు పడ్డాయి. ఇందులో భాగంగానే విమ్స్‌లో నేచురోపతి కాలేజ్, అదే ప్రాంగణంలో 50 పడకల ఆయుష్ ఆస్పత్రి, శొంఠ్యాంలో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ వంటివి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ పనులు దాదాపుగా చివరి దశకు వచ్చాయి. తాజాగా 39 డిస్పెన్సరీలకు కొత్తగా 39 మంది వైద్యులు నిమితులయ్యారు. ప్రకృతి వైద్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ దానేటి ఝాన్సీ లక్ష్మి పేర్కొన్నారు. ఆయుష్‌కు సంబంధించి పలు అంశాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

మధురవాడ ఆయుష్ రీజినల్ కార్యాలయం పరిధిలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు పరిధిలో 113 సెంటర్లు ఉన్నాయి. 31 ఎన్‌హెచ్‌ఆర్ఎం కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఏడాది క్రితమే 22 డిస్పెన్సరీలకు అదనపు వసతులు, సిబ్బందిని కేటాయించి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా అప్‌గ్రేడ్ చేశారు. అలాగే విజయనగరం, కోటబొమ్మాళి, కన్నూరుపాలెంలను స్పెషల్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా అభివృద్ధి చేశారు.

కరోనా తర్వాత పెరిగిన ప్రాధాన్యత

కరోనా తర్వాత ఆయుర్వేద, హోమియో వైద్యంపై ప్రజలకు మరింత అవగాహన పెరిగింది. ప్రస్తుతం ప్రతి కేంద్రం పరిధిలో దాదాపు 50 మందికి తగ్గకుండా రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. దీనికి అనుగుణంగా వైద్యుల సంఖ్య పెరిగింది. డిస్పెన్సరీల్లో మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.

త్వరలో అందుబాటులోకి కళాశాల, ఆస్పత్రి

విమ్స్‌లో నేచురోపతి మెడికల్ కళాశాల, అదే ప్రాంగణంలో 50 పడకలతో ఆయుష్ ఆస్పత్రి, ఆనందపురం మండలం శొంఠ్యాంలో సుమారు రూ.7కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌ల నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ఇవి రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయి.

విమ్స్‌కి మధురవాడ కేంద్రం కార్యాలయం తరలింపు

ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో ఉన్న పలు ఆస్పత్రులకు కేంద్రంగా పనిచేస్తున్న మధురవాడలోని ఆర్‌డీడీ కేంద్రం పూర్తిగా శిథిలస్థితికి చేరుకుంది. కనీస సదుపాయాలే కాదు. రక్షణ కూడా కూడా లేదు. దీంతో కార్యాలయం విమ్స్‌లోకి తరలించేందుకు ప్రయత్నిస్తున్నాం. మధురవాడలో భవనం పూర్తిగా అందుబాటులోకి వస్తే తిరికి మళ్లీ వెనక్కు రావచ్చు. చాలా చోట్ల డిస్పెన్సరీల్లో కనీస సదుపాయాలు లేని విషయం వాస్తవమే. అయితే ఇక్కడ మరిన్ని వసతులు, ఆరోగ్య కరమైన వాతావారణం కల్పిస్తాం.

మధురవాడలో 10 పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు

ఇక్కడ ఆర్‌డీడీ కేంద్రం నిర్మాణంతో పాటు 10 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. ఈ ప్రాంతంలో మరిన్ని ఆయుష్ సేవలు విస్తృతం అయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం ఏపీ ఎంఎస్ఐడీసీ సంస్థ రూ.7కోట్లతో అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

ఒప్పో రెనో 13 సిరీస్ ఫోన్ల విడుదల

డాబాగార్డెన్స్: సెల్ పాయింట్ ఇండియా ఒప్పో రెనో 13 సిరీస్‌ను శనివారం లాంచ్ చేసింది. డాబాగార్డెన్స్‌లోని సెల్ పాయింట్ షోరూంలో సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే నేతృత్వంలో సినీనటి డింపుల్ హయాతి ఒప్పో రెనో 13 సిరీస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌పాయింట్‌లో ఒప్పో రెనో 13 సిరీస్ లాంచ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఏ కంపెనీ అయినా అప్‌డేటెడ్ మొబైల్ మార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చిందంటే.. అది ముందుగా సెల్‌పాయింట్‌లో ఆవిష్కరణ అవుతుందన్నారు. విశాఖపట్నంలో సెల్‌ఫోన్లకు సంబంధించి సెల్‌పాయింట్ అడ్డాగా మారిందన్నారు. మంచి ఫీచర్స్‌తో ఒప్పో రెనో 13 సిరీస్ మార్కెట్లో అందుబాటులో ఉందన్నారు. మోహన్‌ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 సెల్‌పాయింట్ స్టోర్లకు విస్తరించినట్లు వివరించారు. 25 ఏళ్లగా నాణ్యత గల ఉత్పత్తులు, వినియోగదారుల సేవలందించడంలో సెల్‌పాయింట్ విశ్వసనీయతగా నిలిచిందన్నారు. నూతన ఒప్పో రెనో 13 సిరీస్ కొనుగోలుపై లక్కీ డిప్ ద్వారా బైక్‌తో పాటు పలు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, పోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పో రెనో 13 సిరీస్‌ను లాంచ్ చేస్తున్న సినీ హీరోయిన్ డింపుల్ హయాతి, సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే, బాలాజీ పాండే

నేలబావిలో జారిపడి వృద్ధుడి మృతి

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారం గ్రామానికి చెందిన వృద్ధుడు గొర్లి అప్పారావు(78) యడ్లవానిపాలెం గ్రామంలో గల నేలబావిలో పడి మృతిచెందాడు. యడ్లవానిపాలెం గ్రామంలో గల నేలబావిలో నీటిపై తేలి ఉన్న వృద్ధుడి మృతదేహాన్ని చూసి ఎ.కోడూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ లక్ష్మీనారాయణ వచ్చి నేలబావిలో పడి ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించే చర్యలను చేపట్టారు. మృతుడు ఆర్.వై.అగ్రహారం గ్రామానికి చెందిన గొర్లి అప్పారావుగా నిర్ధారించి ఆయన కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. ఈ నెల 6న ఉదయాన్ని ఇంటి వద్ద నుండి తండ్రి టీ తాగేందుకు ఆర్.వై.అగ్రహారం గ్రామంలోనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని పోలీసులకు మృతుడు అప్పారావు పెద్ద కుమారుడు గొర్లి అప్పారావు పోలీసులకు 7న ఫిర్యాదు అందించారు. పోలీసులతో పాటు ఆయన కుటుంబ సభ్యులు వృద్ధుడి కోసం వెదుకుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్.వై.అగ్రహారం గ్రామానికి సమీప గ్రామమైన యడ్లవానిపాలెం బావిలో అప్పారావు మృతిచెంది ఉన్నాడు. వృద్ధుడు ప్రమాదవశాత్తూ నేలబావిలో పడి ఉంటాడని మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే బావిలో పడిపోవడం వల్ల శనివారం నాటికి బావిలో శవం తేలి ఉంటుందని ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి అనకాపల్లిలో పోస్టుమార్టంను నిర్వహించి బంధువులకు అప్పగించారు. అప్పారావుకు భార్య, ఐదుగురు కుమారులు ఉన్నారు.



నేలబావిలో పడి మృతి చెందిన వృద్ధుడు అప్పారావు (ఇన్‌సెట్) గొర్లి అప్పారావు(ఫైల్)

క్లుప్తంగా

క్రీడా ఆణిముత్యాలు

- యోగా, పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న తుమ్మపాల యువకులు



సూర్య సాకేత్



యోగాలో బహుమతులు పొందిన అరుణ్ కుశ్వంత్‌జి

అనకాపల్లి: ఇనుప కండరాలు.. ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన యువత ఈ దేశానికి ఎంతో అవసరం అని వివేకానంద అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకున్న ఇద్దరు క్రీడాకారులు యోగా, పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్నారు. తుమ్మపాలకు చెందిన యువకుడు కోసూరి అరుణ్ కుశ్వంత్‌జి యోగాలో రాణిస్తున్నాడు. కృష్ణా యోగా కేంద్రంలో యోగా ఆసనాలు వేయడంలో ప్రావీణ్యం పొంది సిద్ధహస్తుడయ్యాడు. రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పలు బహుమతులు సాధించాడు. కేంద్రంలో నిత్యం యోగాలో అనేక మందికి శిక్షణ ఇస్తున్నాడు. డిగ్రీ చదివి ఖాళీగా ఉండలేక ప్రైవేటు పరిశ్రమలో పని చూస్తూ ఉపాధి పొందుతున్నాడు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

పవర్ లిఫ్టింగ్‌లో సూర్య సాకేత్..
తుమ్మపాలకు చెందిన పెద్దాడ సూర్య సాకేత్ పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్నాడు. 9వ తరగతి చదువుతున్న సాకేత్ పవర్ లిఫ్టింగ్‌పై మక్కువ పెంచుకున్నాడు. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో ద్వితీయ స్థానం పొందాడు. సహచరులకు పవర్ లిఫ్టింగ్‌లో తర్ఫీదునిస్తున్నాడు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది ధ్యేయమని సాకేత్ ధీమా వ్యక్తం చేస్తున్నాడు.

ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తాం

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల పంచాయతీ సంతబయలు వెంకుపాలెం వెళ్లే రహదారిలో ఇంటింటి కుళాయిలు సంక్రాంతి తర్వాత ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. శనివారం వెంకుపాలెం వెళ్లే రహదారిలో అక్కడ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దశలు వారీగా గ్రామస్తుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. స్థానికులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు సహాయంతో ఇప్పటికే సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడం వల్ల పరిశుభ్రమైన తాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో 17వ వార్డు మెంబర్ తర సత్యారావు, గొంతెన గంగాజలము, ఎర్రంశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కశింకోట: విశ్వహిందూ పరిషత్, వివేకానంద విజ్ఞాన పరిషత్‌ల ఆధ్వర్యంలో కశింకోటలో ఆదివారం ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు విజ్ఞాన పరిషత్ గౌరవాధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. స్థానిక ద్వారపురెడ్డి వీధిలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో జరిగే శిబిరంలో 18 ఏళ్లు పైబడిన యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

గంజాయి కేసులో మరో నిందితుడి అరెస్టు

అనకాపల్లి: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 6న గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఇదే కేసులో మరో నిందితుడు మొల్లి పాల్గుణ(27)ని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు శనివారం తెలిపారు. అతన్ని అనకాపల్లి మండలం కూండ్రం హైస్కూల్ వద్ద పట్టుకుని కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 79 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు , బీ పాజిటివ్-29 యూనిట్లు, ఓ పాజిటివ్-40 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



- కూరగాయల ధరల పెరుగుదలతో ప్రజల బెంబేలు
- కూటమి పాలనలో అమాంతంగా పెంపు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- పండగ పూట వస్తులేనా?

తుమ్మపాల: కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఆర్నెల్లు కావస్తున్నా ధరలు తగ్గడం లేదు. గతంలో ఎప్పుడు లేనంతగా రోజురోజుకు పెరిగిపోతుండటంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. పండగ పూట ఇవి పేదవారికి భారంగా మారాయి. ధరల కట్టడికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. గత ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు ఉన్న ధరలతో పోల్చితే దాదాపు రెట్టింపు కావడంతో లబోదిబోమంటున్నారు. చేతినిండా డబ్బులు పట్టికెళ్లినా సంచి నిండా కూరగాయలు రావడం లేదని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముమ్ముందు ధరలు ఎలా ఉంటాయో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

◆ ఇతర రాష్ట్రాల్లోనూ తగ్గిన ఉత్పత్తి
కూరగాయల దుకాణాలకు రావుల పాలెం నుంచి దొండకాయలు, దోసకాయలు, పుంగనూరు, పలమనేరు నుంచి టమాటా, తెలంగాణ నుంచి బీట్‌రూట్, క్యాప్సికమ్, క్యాబేజీ, కోల్‌కతా, ఇండోర్ నుంచి బంగాళదుంపలు, ఒడిశా నుంచి పచ్చిమిర్చి ఎక్కువగా వస్తుంటాయి. ఆయా ప్రాంతాల్లోనూ ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురవడంతో అక్కడ పంటలకు నష్టం వాటిల్లింది. దాంతో ఉత్పత్తి తగ్గి సరఫరా లేకపోవడంతో కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

◆ అమాంతం పెరిగిపోతున్న నూనె ధరలు...
ఈడిబుల్, క్రూడాయిల్ దిగుమతులపై టాక్స్ పెంపుదల ఆయిల్ ధరలపై ప్రభావం చూపింది. 15 లీటర్ల ఆయిల్ డబ్బా రూ.2,030 వరకు ఉంది. గతంలో రూ.1,800 ఉండేది. లీటరు ప్యాకెట్ రూ.135, రూ.140, రూ.145 వరకు దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ధరలు పెరగడం పేదవర్గాల వారికి భారంగా మారింది. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొంతమంది వర్తకులు కృత్రిమ కొరత సృష్టించి కాసులు దండుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కొరడా ఝుళిపించాల్సిన అధికారుల జాడ అంతంత మాత్రంగా ఉండడంతో ప్రజలకు ధరల భారం మోయక తప్పడం లేదు.

ధరల అదుపులో విఫలం



కూరగాయల ధరలు అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఆరు నెలలుగా ధరలు అమాంతంగా పెరిగిపోతున్నా కనీసం పట్టించుకోలేదు. ప్రతి వ్యాపారంలోను కమీషన్లు వసూలుకే చొరవ చూపుతున్నారు. దీంతో డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి ధరలను మరింత పెంచుతున్నారు. నూనె ధరలు కూడా భారంగా మారాయి.
– ఎం.అచ్యుతరాము, గొలగాం

కూరగాయలు ధరలు

కూరగాయల పేరు,	ధర (కేజీ రూ.)
బీన్స్ పిక్కలు	200
చిక్కుడు	90
గ్రీన్‌పీస్	80
ఆనపకాయ	30
కీర	50
బీట్‌రూట్	50
క్యారెట్	50
వెల్లుల్లి	320
బీరకాయలు	80
క్యాప్సికం	80
కాకర	60
బంగాళదుంప	40
మిర్చి	50
దొండకాయలు	50
బెండకాయలు	50
వంకాయలు	60
ఉల్లి	40
టమాటా	20
అల్లం	60

సంక్రాంతికి ఊరెళ్తే సమాచారం ఇవ్వండి



పట్టణ సీఐ విజయకుమార్

అనకాపల్లి: సంక్రాంతికి ఇతర ప్రాంతాలకు వెళ్లే పట్టణ ప్రజలు ఎల్‌హెచ్‌ఎంఎస్ డౌన్‌లోడు చేసుకుని, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, విలువైన వస్తువులు గృహాల్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లతో భద్రపరుచుకోవాలని పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సమయంలో అనుమానితులు చుట్టుపక్కల తిరిగినా సమాచారం అందించాలని కోరారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో ద్వారా ఇప్పటికే ప్రచారం చేశామన్నారు. సంక్రాంతికి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పర్మిషన్లు లేకుండా డీజేలు నిర్వహించకూడదని, కోడి పందేలు ఆడుటగాని, అశ్లీల నృత్యాలు చేయుటగాని నేరమని హెచ్చరించారు.

రేపు ప్రతిభా పురస్కారాలు ప్రదానం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న గౌరీ గ్రంథాలయంలో 2025 సంక్రాంతి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సంఘం అధ్యక్షుడు భీమరశెట్టి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ నుంచి పీజీ వరకు వివిధ కోర్సుల్లో ప్రతిభ చూపిన గవర విద్యార్థులకు వీటిని అందిస్తామన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



వివేకానంద వేషధారణలో చిన్నారి

అనకాపల్లి: స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ స్కూల్ ఆవరణలో శనివారం ముందస్తుగా జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. చిట్టిపొట్టి చిన్నారులు వివేకానంద వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్‌కుమార్ మాట్లాడుతూ 1863 జనవరి 12న కోల్‌కత్తాలో స్వామి వివేకానంద జన్మించారన్నారు. ఇతని పూర్వ నామం నరేంద్రనాథ్ దత్త అన్నారు. సమాజ హితం కోసం, మార్పు కోసం సన్యసించి, భారతీయ ఆధ్యాత్మికవేత్త రామకృష్ణ పరమహంస ప్రధాన శిష్యునిగా సమాజాన్ని మార్చే శక్తి కేవలం యువతకు మాత్రమే ఉందని ప్రబోధిస్తూ ఆనాటి సమాజంలో అనేక రుగ్మతులను రూపుమాపుటకు అనేక ప్రతిపాదనలు చేసిన తత్వవేత్త, సంఘ సంస్కర్త అని కొనియాడారు. ప్రిన్సిపాల్ సునీత, విశ్రాంత ఏఈ మళ్ల చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ రోడ్లన్నీ రద్దీ!



పట్టణంలో రద్దీగా మారిన రోడ్లు

తుమ్మపాల: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణంలో రోడ్లన్నీ రద్దీగా మారాయి. విద్య, ఉద్యోగ, వృత్తి పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా స్వగ్రామాల బాట పట్టారు. వీరితోపాటు పండగ సామగ్రి, నూతన వస్త్రాలు కొనుగోలుదారులతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. పలు వ్యాపార, వస్త్ర దుకాణాల్లో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. షాపింగ్‌మాల్స్ ప్రత్యేక ఆఫర్లతో ప్రజలను ఆకర్షిస్తున్నాయి. కొనుగోలుదారులకు ఉచిత బహుమతులు, కూపన్లతో డిస్కౌంట్లు రకరకాల బొనాంజాలు ప్రకటించడంతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ప్రజలు కుటుంబ సమేతంగా పట్టణానికి చేరుకుని నూతన వస్త్రాలు, గృహోపకరణాలు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలో చేపల బజారు నుంచి మొదలుకుని పెరుగుబజార్, రాతీమెడ, కన్యాకపరమేశ్వరి ఆలయ సమీపం, వేల్పులవీధి మదుం, నాలుగు రోడ్ల వరకు రోడ్డంతా రద్దీగా వాహనాలతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది.

25 కేరళ విస్కీ క్వార్టర్ సీసాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కేరళ స్కీ క్వార్టర్ సీసాలు

కశింకోట: మండలంలోని బయ్యవరంలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా 25 కేరళ విస్కీ క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ సూర్యారావు శనివారం తెలిపారు. పేరంటాలపాలెంకు చెందిన పువ్వల ప్రసాదరావు(42) గోనె సంచిలో వీటిని తరలిస్తుండగా, తేగాడ వైపు వెళ్లే మార్గంలోని ముఖద్వారం వద్ద పట్టుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న పాత్రుపల్లి వీరుయాదవ్

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల ప్రజలు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ధనవంతులు తమ వంతు సహాయం అందించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ కోరారు. స్థానిక ఉడ్‌పేట సంఘం కార్యాలయం వద్ద సంక్రాంతిని పురస్కరించుకుని యలమంచిలి అమ్మ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వంద మంది దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో జీవించాలని, కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారిగా నాగ అనూష



నాగ అనూషకు బాధ్యతలు అప్పగిస్తున్న ఇన్‌చార్జి వైద్యాధికారి శిరీష

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారిగా కె. నాగఅనూష శనివారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న డాక్టర్ టి. శిరీష ఆమెకు బాధ్యతలు అప్పగించారు. శిరీషను అచ్యుతాపురం మండలం హరిపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రికి బదిలీ చేశారు. శిరీష ఇన్‌ఛార్జిగా వ్యవహరించి అనతి కాలంలోనే వైద్య సేవలందిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు



పట్టణంలో సారె ఊరేగిస్తున్న వేల్పుల వీధి మహిళలు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. మహిళలు వివిధ రకాల పిండి వంటకాలు తయారు చేసి అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపుగా పట్టణంలో తిరిగి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవ కమిటీ పోస్టర్ ఆవిష్కరణ....
స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవం ఈ నెల 18న అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వాకాడ బాబు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు భీమరశెట్టి రాంకీ అమ్మవారి కరపత్రాలను ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎంవో అశోక్‌కుమార్, వైద్యుడు లక్ష్మణ శ్రీనివాసరావు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్‌ఎంవో అశోక్‌కుమార్, జనరల్ ఫిజీషియన్ లక్ష్మణశ్రీనివాసరావు ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి పెద్దాడ అప్పారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలు, 12వ పీఆర్సీ కమిటీ వేసి, తాత్కాలిక భృతి 36 శాతం చెల్లించాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎస్‌ఐ బకాయిలు చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు 100 శాతం వేతనం చెల్లించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ, యూనియన్ జిల్లా నాయకులు ఎం.తిరుమలరావు, కోరుప్రోలు సత్యనారాయణ, నంది కోళ్ల దివాకర్, కాళ్ల విష్ణు, ఎస్.సంతోష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో 'కూడారై' ఉత్సవం



వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త శ్రీరామాచార్యులు



భక్తులకు పాయసాన్ని ప్రసాదంగా వితరణ

కశింకోట: దేవాలయాల్లో శుక్రవారం 'కూడారై' ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా దేవాదాయ శాఖకు చెందిన స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారిని పూలమాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. గోదాదేవి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సంప్రదాయంగా రెండు రకాల పాయసాన్ని నెయ్యి, డ్రైఫ్రూట్స్‌తో పెద్ద అండాలతో తయారు చేయించి స్వామికి నివేదించారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన వంట శాలను ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతిల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద అండాతో పాయసాన్ని తయారు చేసి స్వామికి నివేదించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పాయసం పంపిణీ

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కొణతాల జనార్దన్



మొదటి బహుమతి సాధించిన కొదమ సింహం ట్రూపు ప్రదర్శన

అనకాపల్లి: హిమశేఖర్ జూనియర్ కళాశాల విద్యార్థుల సంక్రాంతి సంబరాలు అలరించాయి. శనివారం స్థానిక గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ కల్యాణ మండపంలో వివేకానంద జయంతి, సంక్రాంతి వేడుకలను హిమశేఖర్ కళాశాలల అధినేత కొణతాల జనార్దన్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వివేకానందస్వామి భారతీయ ఔన్నత్యాన్ని ప్రపంచ ప్రజలకు తెలియజేయడమే కాక, యువతకు దిక్సూచిగా దిశానిర్దేశం చేశారన్నారు. అంతకుముందు విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కొదమ సింహం, ప్రేమనగర్, జగదీక వీరుడు అతిలోక సుందరి ట్రూప్‌లకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందజేశారు. యమగోల, అహ నా పెళ్లంట, అడవిరాముడు, దేవత, అభిలాష, ఖైదీలు ట్రూప్‌లు పోటీపడ్డాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేష్, ఆర్.ఎస్.ఎస్. జిల్లా ప్రచారక్ హరి, సాంస్కృతిక కార్యక్రమాలు నాయమూర్తులు అగ్గాడ హనుమంతరావు, బుద్ధ శ్రీనివాస్, గొట్టివాడ శ్రీరాములు, ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, రమేష్, సతీష్, దుర్గారావు, నాగశివ, బి.ఉమామహేశ్వరరావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పరమేశ్వరరావు సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న రఘువర్మ

తుమ్మపాల: ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన నూతలపాటి పరమేశ్వరరావు సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ రఘువర్మ అన్నారు. పట్టణంలో ఏపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం కార్యవర్గ సమావేశం జరిగింది. దివంగత పరమేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా విద్యా వ్యవస్థ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.ఎల్.ఎన్.వి.ధర్మారావు, పూర్వ కార్యదర్శి వెంకటపతి రాజు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి తమరాన త్రినాథ్, మండల అధ్యక్షుడు కొణతాల గణేష్, శ్రీనివాసరావు, జిల్లా సంఘ సభ్యులు, వివిధ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి రక్తదానమే లక్ష్యం



రక్తదానం చేస్తున్న యువత

తుమ్మపాల: పట్టణంలోని పూడిమడక రోడ్డులో బి-వన్ హాస్పిటల్ ప్రాంగణంలో అభినవ భారత్ స్వచ్ఛంద సంస్థ, అమ్మ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం మెగా వలంటరీ స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. నిర్వాహకులు భవానీశంకర్, వి.ఎ.రాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తం అందించడమే లక్ష్యంగా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. 45 మంది యువకులు రక్తదానం చేశారు. అమ్మ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కిరణ్, డాక్టర్ గంగాధర్ రక్తదాతలను అభినందించి జ్ఞాపికలను అందించారు. ఆర్గనైజర్ ఎస్.మహేష్, ఎం.సంతోష్ కుమార్, శ్యామ్, శ్రీను, ఆర్.బోసు, పి.నాగేష్, అవినాష్, స్టాలిన్, రమణాజీ, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ స్టాఫ్ ఎం.గణేష్, నాయుడు, కె.కె.ఎం.సతీష్ పాల్గొన్నారు.

కత్తికోడి పందేలు నిషేధించాలని వినతి



డీఎస్పీ శ్రావణికి వినతిపత్రం అందజేస్తున్న బొట్టా చిన్నియాదవ్

అనకాపల్లి: పండగ వేళలో కత్తికోడి పందేలకు అడ్డుకట్ట వేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రావణికి శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు. కత్తికోడి పందేలు కారణంగా పండగల్లో లక్షలాది వ్యాపారాలు లావాదేవీలు జరుగుతున్నాయని, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధించాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, బండి అప్పారావు, బొడ్డు సోమరాజు, ఆదారి బుచ్చిరాము తదితరులు పాల్గొన్నారు.